# పత్తికొండకు చంద్రబాబు చేసిందెంత?

- నాడు హామీలు తప్ప అభివృద్ధి పనుల్లేవ్
- నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి


వైఎస్సార్‌సీపీ హయాంలో వెల్దుర్తిలో కొత్తగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి.


వెల్దుర్తి-రామళ్లకోట మధ్య వేసిన డబుల్ రోడ్డు

**పత్తికొండ టౌన్:** గత ఐదేళ్ల టీడీపీ పాలనలో పత్తికొండ నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులేమీ జరగలేదు. టీడీపీ అధినేత చంద్రబాబు పత్తికొండలో టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తానని, రెవెన్యూ డివిజన్‌గా చేస్తానని, బంగారు కొండగా చేస్తానని ప్రగల్భాలు పలికారు. కానీ ఆచరణలో చేసింది మాత్రం శూన్యం. తుగ్గలి మండలం చెన్నంపల్లి కోటలో గుప్తనిధులు ఉన్నాయని అధికారులను కాపలాగా పెట్టి టీడీపీ నాయకుల చేత తవ్వకాలు జరిపించిన ఘనత చంద్రబాబుది అని స్థానికులు విమర్శిస్తున్నారు. నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కేఈ కృష్ణమూర్తి రాష్ట్రస్థాయిలో డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రిగా ఉన్నా ఇక్కడ అభివృద్ధి మాత్రం శూన్యం అని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవ వల్ల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో నిధులు కేటాయించారు.

**మండలాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు ఇలా..**

**పత్తికొండ మండలం**

పత్తికొండ కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చరిత్రాత్మకం. నియోజకవర్గంలోని 4 మండలాలు, ఆలూరు నియోజకవర్గంలోని 5 మండలాలు మొత్తం 9 మండలాలతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది.

- 12 పోలీస్‌స్టేషన్ల పరిధితో పత్తికొండ కేంద్రంగా పోలీసు సబ్‌డివిజన్ ఏర్పాటు
- పట్టణ ప్రధాన రోడ్ల విస్తరణకు రూ.30 కోట్ల నిధులు మంజూరు, ఇప్పటికే పనులు ప్రారంభం
- వివిధ వార్డులలో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- రూ.7.50 కోట్లతో హోసూరు-మొలగవల్లి బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభం
- దూదేకొండ- కొత్తపల్లి గ్రామాల మధ్య రూ.5.5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం
- మండలంలోని రాజుల మందగిరి, అటికెలగుండు, కోతిరాళ్ల, పులికొండ గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం

**కృష్ణగిరి మండలం**

**గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు**

- కంబాలపాడు సమీపంలో టీటీడీ దేవస్థానం, దేవదాయ శాఖ అధ్వర్యంలో రూ.2 కోట్లతో వేంకటేశ్వర స్వామి ఆలయం, కల్యాణ మండపం ఏర్పాటుకు 2018లో భూమిపూజ చేసి వదిలేశారు.
- 68 చెరువులకు నీరు మళ్లిస్తామని ఆర్భాటంగా పనులు ప్రారంభించి ఎన్నికల నాటికి 15 శాతం పనులు మాత్రమే చేపట్టి చేతులు దులుపుకున్నారు.
- మండలంలోని కంబాలపాడు, ఎరుకలచెర్వు గ్రామాలను 2015-16లో దత్తత తీసుకుని రూ.6 కోట్ల నిధులతో సీసీ రహదారులు, డ్రైనేజీ పనులను కాంట్రాక్టర్లు నాసిరకంగా చేపట్టడంతో ఏడాదిలోపే కొన్ని రహదారులు గుల్లగా మారిపోయాయి.

**వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన పనుల్లో కొన్ని..**

- చుంచుఎర్రగుడి వద్ద ప్రధాన రహదారి వంకలో రూ.50 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రైతులు, వాహనదారుల కల నెరవేర్చారు.
- హంద్రీనీవా కాలువ గుండా 68 చెరువులకు నీరు మళ్లించే పనులు టీడీపీ హయాంలో 15 శాతం జరగ్గా, మిగతా 85 శాతం పైప్‌లైన్ పనులు పూర్తి చేసి రెండుసార్లు ట్రయల్ రన్ ద్వారా దాదాపు 10 చెరువులకు నీరు మళ్లించారు.
- కంబాలపాడు సమీపంలో గత ప్రభుత్వంలో 18 గ్రామాలకు శుద్ధ జలం అందించేందుకు మదర్ ప్లాంటు ఏర్పాటు పనులు ఎన్నికల నాటికి పూర్తి చేయకపోగా ఈ పనులను పూర్తిచేసి నేడు 18 గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా శుద్ధ జలం పంపిణీ చేస్తున్నారు.
- ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామ పంచాయతీలో రూ.2.5 కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టారు.
- కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి వెల్దుర్తి ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.3.10 కోట్లతో పనులు పూర్తి చేసి నీటి సరఫరా చేస్తున్నారు.

**తుగ్గలి మండలం**

- టీడీపీ హయాంలో చెరువులకు నీళ్లిస్తామని చెప్పిన హామీ నెరవేరలేదు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రస్తుతం పైపులైన్ పనులు సాగుతున్నాయి

**వెల్దుర్తి మండలం**

- వెల్దుర్తిలో 10 పడకల ప్రభుత్వాసుపత్రిని 30 పడకల సామర్థ్యానికి పెంచుతూ నాబార్డు నిధులు రూ.5.77 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు.
- వెల్దుర్తి నుంచి రామళ్లకోటకు రూ.10 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించారు.
- వెల్దుర్తి పట్టణానికి రూ.3.50 కోట్లతో క్రిష్ణగిరి రిజర్వాయర్ నుంచి పైపులైను వేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఇవిగాక గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, జలజీవన్ మిషన్ పనులు చేపట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

- 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గంలో 42 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తుగ్గలి మండలంలో 24 మంది ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను టీడీపీ పట్టించుకోలేదు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తుగ్గలి మండలంలో ఆత్మహత్య చేసుకున్న 24 మంది రైతుల కుటుంబాలకు రూ.1.96 కోట్లు ఆర్థిక సాయం అందించింది.
- నియోజకవర్గంలో 7,953 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వాటిలో 1,075 పూర్తికాగా, 5,772 వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం రూ.41.10 కోట్లు ఖర్చు చేశారు. తుగ్గలి మండలంలో 1,744 మంజూరు కాగా వాటిలో 205 పూర్తయ్యాయి. 1385 వివిధ దశల్లో ఉన్నాయి. రూ.7.78 కోట్లు ఖర్చు చేశారు.
- చెరువుల బలోపేతం కోసం మద్దికెర మండలం మదనంతపురం చెరువు, తుగ్గలి మండలంలోని 13 చెరువులు, కుంటల బలోపేతానికి రూ.36.39 కోట్లు ఖర్చు చేసింది.
- వైఎస్సార్ ఆసరా కింద ఏటా 673 స్వయం సహాయక సంఘాల్లోని 6,914 మంది మహిళలకు రూ.3.82 కోట్లు చొప్పున మూడు విడతల్లో ఇప్పటివరకు రూ.11.46 కోట్లు మాఫీ చేశారు.

## క్లుప్తంగా

### నీటి ఎద్దడి నివారణకు చర్యలు


గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు

**నందవరం:** వేసవి దృష్ట్యా గ్రామంలో నీటి ఎద్దటి నివారణకు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తోట సావిత్రి, పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు పేర్కొన్నారు. నందవరంలో గ్రామ సచివాలయం-1 ఆవరణలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామంలో నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా బోర్లు, నీటి కుంటలు, తిమ్మారెడ్డి కుంట ద్వారా ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులకు సరఫరా చేసి తద్వారా కుళాయిలకు అందిస్తామన్నారు. 6, 7వ వార్డుల్లో నీటి సమస్య ఉందని వార్డు సభ్యులు అర్జీ ఇచ్చారు. గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే దారిని ఆక్రమించి షాపులు వేసుకున్నారని, వాటిని తొలగించాలని గ్రామస్తులు కోరారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని పంచాయతీ అధికారులు హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సామేలు, ఉప సర్పంచ్ శివారెడ్డి గౌడ, వార్డు సభ్యులు చాంద్ తాత, ముత్తన్న, విజయన్న, రమేశప్పగౌడ, ఎల్లాగౌడ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలను మభ్యపెట్టేందుకే లోకేష్ యాత్ర

**తుగ్గలి:** యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్ నాడు ఆయన తండ్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చెప్పగలరా అని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్ పార్టీ నాయకులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటీ నెరవేర్చకుండా జనాలను మోసం చేశారన్నారు. రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం లాంటి హామీలు ఏమయ్యాయో సమాధానం చెప్పి లోకేష్ పాదయాత్ర చేపడితే బాగుంటుందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు లోకేష్ చేస్తున్న పాదయాత్రను ఎవ్వరూ నమ్మరని స్పష్టం చేశారు.


### రోడ్డు నిబంధనలు పాటించాలి

**కృష్ణగిరి:** రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి వాహనదారులను హెచ్చరించారు. మండల పరిధిలోని అమకతాడు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు ఘాటు హెచ్చరికలు జారీచేశారు. పరిమితికి మించి ప్రమాణికులను తరలించడం, అజాగ్రత్త, అతివేగం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారుల్లో సూచించిన మార్కింగ్‌లోనే వెళ్లాలని రాంగ్ రూట్‌లో పోరాదన్నారు. హెల్మెట్, లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు లేని వారి నుంచి జరిమానా వసూలు చేశారు.

### గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**కృష్ణగిరి:** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో పనిచేయాలని సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మహాలక్ష్మి అన్నారు. కృష్ణగిరి సచివాలయంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో వారు మాట్లాడారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాల్లో విద్య, వైద్యం, నీరు, చెట్ల పెంపకం సమృద్ధిగా ఉన్నప్పుడే అభివృద్ధిలోకి వస్తామన్నారు. అధికారుల సూచనలను గ్రామస్తులు పాటించాలని కోరారు. సమస్యలున్న వారు గ్రామ సచివాలయానికి వచ్చి తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, మండల కో-ఆప్షన్ మెంబర్ నక్కషాలు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### చెప్పలంటే అలర్జీ!


ఎండలో చెప్పల్లేకుండా వస్తున్న బెనకప్ప

**హొళగుంద:** అతనికి చెప్పులంటే అలర్జీ. ఎంత ఎండలోనైనా ఉత్త కాళ్లతోనే నడుస్తాడు. కాళ్లకు బొబ్బలెక్కినా సరే చెప్పులు మాత్రం వేసుకోడు. సమ్మతగేరికి చెందిన 63 ఏళ్ల బోయ బెనకప్ప చిన్నప్పటి నుంచి చెప్పులు లేకుండానే తిరుగుతున్నారు. చిన్నప్పుడు బలవంతం మీద కుటుంబసభ్యులు చెప్పులు తొడిగించడంతో విపరీతంగా జ్వరం, ఇతర సమస్యలు మొదలయ్యాయి. అప్పటినుంచి చెప్పులు తొడిగిన దాఖలాలే లేవు. పొలానికి వెళ్లినా, ఇతర గ్రామాలకు వెళ్లినా చెప్పులు ఉండవు. పనుల నిమిత్తం వారానికి రెండుమూడుసార్లు గ్రామం నుంచి 6 కి.మీ దూరంలో ఉన్న హొళగుందకు కాలినడకన చేరుకుంటాడు. ఎవరైనా బైక్ ఎక్కించుకుని తీసుకెళ్తే తప్పా కాలిబాటనే అనుసరిస్తాడు. ఉగాది పండుగ సమయంలో శ్రీశైల మల్లన్న దర్శనానికి దాదాపు 200 కి.మీ నడిచి వెళ్లడంతో కాళ్లకు బొబ్బలు లేచి గాయాలైనా బెదరలేదు. మండుటెండల్లోనూ చెప్పులు లేకుండా వెళ్తున్న బెనకప్పను కొత్తగా చూసిన అయ్యయ్యో అని జాలి పడినా తర్వాత విషయం తెలుసుకుని సంభ్రమాశ్చర్యాలకు గురౌతున్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


వారోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న టౌన్ సీఐ మధుసుధన్‌రావు, ఫైర్ ఎస్‌ఐ అంజనేయులు

**ఎమ్మిగనూరురూరల్:** అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ మదుసుధన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్ అంజనేయులు ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలను టౌన్ సీఐ ప్రారంభించారు. ముందుగా అగ్నిప్రమాదాల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ, ఫైర్ అఫీసర్‌లు మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న బొంబాయి ఓడరేవులో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 66 మంది అగ్నిమాపక పోలీసులు చనిపోయారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారోత్సవాలను జరుపుకుంటున్నారని చెప్పారు. వారం రోజుల పాటు ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహనలు కల్పించనున్నట్లు తెలిపారు. ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆలూరు రూరల్:** స్థానిక ఫైర్ స్టేషన్ ఆవరణలో ఫైర్ అధికారి ఖాద్రి ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. అనుకోని పరిస్థితులలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్రమాదం సంభవిస్తే వెంటనే 101 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## చలివేంద్రాలు ప్రారంభం


వెల్దుర్తి పాతబస్టాండులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ముత్యాల శైలజ

**వెల్దుర్తి:** మండల కేంద్రంలోని డోన్ రైల్వే గేట్ల వద్ద హైవే సర్కిల్‌లో స్థానిక పంచాయతీ 13వ వార్డు మెంబరు జె.నాగమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. విచ్చేసిన అతిథులకు బుడగ జంగాల నాయకులు పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వెంకటనాయుడు, శ్రీనివాసులు నాయుడు, బుడగ జంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

- నిత్యం రద్దీగా ఉండే వెల్దుర్తి పాతబస్టాండులో పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సర్పంచ్ ముత్యాల శైలజ ప్రారంభించగా జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**మద్దికెర:** పెరవలి గ్రామంలోని ప్రధాన కూడలిలో సర్పంచ్ మల్లికార్జున, ఉపసర్పంచ్ ఆముదాల గోపాల్ శుక్రవారం పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల కోసం ఉంచిన నీటిని వృథా చేయవద్దని కోరారు. ఈఓ సుధాకర్ పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**ఎమ్మిగనూరురూరల్:** పట్టణ పరిసర ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మధుసూదన్ రావు తెలిపారు. సర్దార్‌పురం సమీపంలో కొందరు పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడిచేసి పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు చెప్పారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకోగా మరికొందరు పారిపోయినట్లు వెల్లడించారు. రూ. లక్ష నగదు స్వాధీనం చేసుకుని పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

## ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ

**ఆలూరు రూరల్:** నేషనల్ ట్యాలెంట్ ఒలంపియాడ్ పరీక్షల్లో ఆలూరు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ అర్చన శుక్రవారం తెలిపారు. ఈ నెల 11న విద్యార్థులకు రాష్ట్రస్థాయి మ్యాథమ్యాటిక్స్ ట్యాలెంట్ ఒలంపియాడ్, జనరల్ ట్యాలెంట్ ఒలంపియాడ్ విభాగంలో పోటీ పరీక్షలు నిర్వహించారన్నారు. ఇందులో ఆలూరు చైతన్య స్కూల్ నుంచి 28 మంది విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చెప్పారు. విద్యార్థులు కేశవకుమార్ 4వ ర్యాంక్, ఇషాంత్ 5వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

## నేడు విద్యుత్ కోతలు

**వెల్దుర్తి:** విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా అల్లుగుండు, వెల్దుర్తి ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. అల్లుగుండు, బొమ్మిరెడ్డిపల్లె, మల్లెపల్లె, నార్లాపురం గ్రామాలతోపాటు చెరుకులపాడు రహదారి నుంచి నార్లాపురం వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 3 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు.

## గడప గడపలో సంక్షేమ లబ్ధి


లంకాయపల్లిలో సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**తుగ్గలి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా? లేదా? తెలుసుకునేందుకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం లంకాయపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, గ్రామానికి తారు రోడ్డు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తన పెద్దమ్మ అనంతమ్మ ఇంటిని సందర్శించి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు మరిన్ని కొత్త పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా తమ ప్రభుత్వంలో అర్హత ఉన్నవారందరికీ నేరుగా పథకాలు అందిస్తున్నామని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరెడ్డి, అమరనాథరెడ్డి, హనుమంతరెడ్డి, రాతన మోహన్‌రెడ్డి, హనుమంతు, తుగ్గలి మోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రమేష్, ఆదిలక్ష్మి, రామంజినేయులు పాల్గొన్నారు.

**ముస్లింలకు ఇఫ్తార్ విందు**

**వెల్దుర్తి:** రంజాన్ నెల పురస్కరించుకుని ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్న పట్టణంలోని ముస్లింలకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. జామియా మసీదులో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డితో కలిసి ముస్లింలకు భోజనం వడ్డించారు. జెడ్పీటీసీ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర నిరంకుశ పాలనపై ప్రచారభేరి



వెల్దుర్తి పాతబస్టాండు నుంచి ప్రచారభేరి ప్రారంభిస్తున్న వామపక్ష నాయకులు

**వెల్దుర్తి:** కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షాలు తలపెట్టిన ప్రచార భేరి శుక్రవారం వెల్దుర్తి పాతబస్టాండు నుంచి ప్రారంభమైంది. సీపీఐ, సీపీఎం సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్, సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ పాల్గొన్నారు. ముందుగా పాతబస్టాండులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నరేంద్ర మోదీని గద్దె దింపండి - దేశాన్ని కాపాడండి అన్న నినాదంతో ఈనెల 30 వరకు గ్రామ గ్రామన ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలతో ర్యాలీగా సాగిపోయారు. కార్యక్రమంలో ఆయా పార్టీల, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

**మద్దికెర:** మండలకేంద్రంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబిరసూల్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హనుమప్ప ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయాలని చూస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**నందవరం:** ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీని గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గురుశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నందవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రచార భేరి ద్వారా నిరసన చేపట్టారు.

## రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


పత్తికొండలో నివాళులర్పిస్తున్న ఆర్డీఓ మోహన్‌దాస్


చిప్పగిరిలో నివాళులర్పిస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు తదితరులు


ఎమ్మిగనూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్

**పత్తికొండటౌన్:** అంటరానితనం, అసమానతలు లేని సమాజం ఏర్పడాలని కలలుగన్న భరతమాత ముద్దుబిడ్డ, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో ముందుకుసాగుదామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను శుక్రవారం నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఘనంగా నిర్వహించారు. పత్తికొండలో బీవై రామయ్య, కంగాటి శ్రీదేవి పార్టీ నాయకులతో కలిసి పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ నారాయణదాసు, సర్పంచ్ కొమ్ముదీపిక, శ్రీరంగడు,సోమశేఖర్, భాస్కర్‌నాయక్, కారం నాగరాజు,బలరాముడు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ మోహన్‌దాసు, సిబ్బంది, పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ గోపాల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

**తుగ్గలి:** లంకాయపల్లిలో సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మారెళ్ల, జొన్నగిరి, బొందిమడుగుల, తుగ్గలిలో ఉద్యోగులు, దళిత సంఘాల నాయకులు, ఎస్సీ కాలనీ వాసులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఎమ్మిగనూరుటౌన్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్లు నజీర్‌అహమ్మద్, దివ్యకళాసునీల్‌కుమార్ తదతరులు పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ కీర్తిని కొనియాడారు. అలాగే వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ నివాళులర్పించారు.

**చిప్పగిరి:** స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఉన్న విగ్రహానికి దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వెఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## జవాబుదారీగా పనిచేయాలి


రామళ్లకోట గ్రామసభలో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

**వెల్దుర్తి:** ఏ చిన్న అవసరానికైనా ప్రజలు పంచాయతీ కార్యాలయానికి, సచివాలయానికి వచ్చినపుడు సంబంధిత అధికారులు జవాబుదారీగా ఉండి వారి సమస్య తీర్చేందుకు బాధ్యతగా పనిచేయాలని డీపీఓ నాగరాజు నాయుడు సూచించారు. శుక్రవారం ఆయన రామళ్లకోట పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు డీఎల్‌పీఓ తిమ్మక్కతో కలిసి హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు, సర్పంచ్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, బీటీ నాయుడు తదితరులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరించి, సమస్యలపై చర్చించి పరిష్కరించుకునేందుకు గ్రామసభలు నిత్యం నిర్వహించాలన్నారు. గ్రామాలలో అసాంఘిక, దురాచారాలను రూపుమాపే దిశగా ఉద్యోగులు కృషిచేయాలన్నారు. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు. వెల్దుర్తి మేజర్ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కృష్ణగిరిలో ఇంటి గోడకు జగనన్న స్టిక్కర్ అతికించుకుంటున్న మహిళ

**కృష్ణగిరి:** పేదల సంక్షేమం కోసం పరితపించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మికాంతరెడ్డి, జయరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చుంచుఎర్రగుడి, జి.మల్లాపురం, కృష్ణగిరి తదితర గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు కరపత్రాలు అందజేసి వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదలకు ఆర్థిక తోడ్పాటునందించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని కొనియాడారు. వారి నుంచి జగనన్న స్టిక్కర్లను తీసుకున్న మహిళలు ఆప్యాయంగా ఇంటి గోడలకు అతికించుకున్నారు.

**హొళగుంద:** మండల పరిధిలోని హెబ్బటం, కోగిలతోట, లింగంపల్లి, బీ.జీ హళ్లి, హొళగుంద, నెరణికి, గజ్జహళ్లి, వందవాగిలి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఉరుకుందప్ప, వెంకోబ, నాగప్ప, వెంకటేష్, ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల పాలనలో తేడాలను వివరించారు. ప్రజల అభిప్రాయం తీసుకుని ఇళ్లకు స్టిక్కర్లు అంతికించారు.

**చిప్పగిరి:** మండలంలో జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి లబ్ధిదారుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

**ఆలూరు రూరల్:** చేసిన మేలును ప్రజా ప్రతినిధులు చెబుతుంటే అందిన సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటూ లబ్ధిదారులు 'మా నమ్మకం నువ్వే జగనన్న' అని అంటున్నారు. శుక్రవారం దేవనకొండ మండలంలోని పెద్ద కోటకొండ గ్రామంలో కారుమంచి లక్ష్మమ్మ తన భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ప్రతినెలా తన మాత్రల ఖర్చు, ఇతర అవసరాల కోసం రూ.2,750 పింఛన్ నగదు అందిస్తున్నాడని చెబుతూ జగనన్న స్టిక్కర్‌కు చేతులెత్తి మొక్కింది.


పెద్ద కోటకొండలో జగనన్న స్టిక్కర్‌కు చేతులెత్తి మొక్కుతున్న వృద్ధురాలు లక్ష్మమ్మ